సాక్షి
అనంతపురం
మంగళవారం ¦ 2 ¦ ఏప్రిల్ ¦ 2024



నీ సాయమే అయ్యా

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం దక్కడంతో కృతజ్ఞతగా పంటను తీసుకువచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందిస్తున్న మహిళా రైతు





జన కెరటం

జన తరంగం: కదిరిలో నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్రలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జగన్నినాదం

- మండుటెండను సైతం లెక్క చేయక భారీగా తరలివచ్చిన జనం
- దారి పొడవునా పూల వర్షం కురిపించిన అభిమాన గణం
- బాణసంచా పేలుళ్లు...క్రేన్‌ల ద్వారా గజమాలలతో ఘన స్వాగతం
- ఊరూరా అంబరమంటిన సంబరం... మార్మోగిన జగన్నినాదం
- చిన్న పిల్లలను ఎత్తుకుని జగన్‌ను చూసేందుకు వచ్చిన మహిళలు
- బైక్ ర్యాలీలతో యువత జోరు.. నృత్యాలు చేస్తూ జనహోరు
- బత్తలపల్లి, ముదిగుబ్బ, పట్నం, కదిరి, తనకల్లు మీదుగా చీకటిమానిపల్లి వరకు సాగిన బస్సుయాత్ర
- శ్రీసత్యసాయి జిల్లాలో సీఎం వైఎస్ జగన్‌కు అపూర్వ ఆదరణ
- కదిరి, హిందూపురం, పుట్టపర్తికి చెందిన పలువురు పార్టీలో చేరిక
- పార్టీ కండువా వేసి ఆహ్వానించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జైత్రయాత్ర చేస్తున్న జననేత జగన్ తమ ఊరికే వచ్చిన వేళ పల్లెల్లో సంబరం అంబరాన్ని తాకింది. భారీగా తరలివచ్చిన అభిమానులతో బత్తలపల్లి కూడలిలో జన కెరటం ఉవ్వెత్తున ఎగసింది. ముదిగుబ్బ కిటకిటలాడింది. కదిరి జన కడలిని తలపించింది. ఇలా రోడ్‌షో జరిగిన ఊళ్లన్నీ జనసాగరాలయ్యాయి. పొలాల్లో పని చేసుకుంటున్న కష్టజీవులు.. విద్యార్థులు.. యువకులు, వృద్ధులు, వ్యాపారులు.. ఇలా ఒకరేమిటి ప్రజలందరూ జననేతకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు నృత్యాలు చేస్తూ...హారతులు పడుతూ ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో కదం తొక్కారు. యువత పార్టీ జెండాలు చేత పట్టుకుని బైకులతో భారీ ర్యాలీలు నిర్వహించారు. దారిపొడవునా కాన్వాయ్‌ను అనుసరించారు. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ఐదో రోజు సోమవారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో దిగ్విజయంగా సాగింది.

సాక్షి, పుట్టపర్తి : అభిమానం ముందు...మండుటెండ మలయమారుతంగా మారింది. జననేత జగన్‌ను చూడాలన్న ఆశ..భానుడి భగభగలను తుత్తునీయలు చేసింది. చిన్నా, పెద్దా అంతా తరలిరాగా జనకెరటం ఎగసిపడింది. ఊరూవాడా జగన్నినాదం ప్రతిధ్వనించింది. బత్తలపల్లి మండలం సంజీవపురం వద్ద సోమవారం ఉదయం ప్రారంభమైన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర బత్తలపల్లి, రామాపురం, కట్టకిందపల్లి, రాళ్ల అనంతపురం, ముదిగుబ్బ, ఎన్ఎస్‌పీ కొట్టాల, మలకవేముల, పట్నం, నడింపల్లి, కాళసముద్రం, ఎర్రదొడ్డి, కుటాగుళ్ల, కదిరి, మోటుకపల్లె, జోగన్నపేట, ఎస్.ములకలపల్లె మీదుగా చీకటిమానిపల్లి వరకూ సాగింది.

బత్తలపల్లిలో భారీ స్వాగతం

ఉదయం 10.20 గంటలకు బత్తలపల్లి మండల పరిధిలోని సంజీవపురం బస కేంద్రం నుంచి సీఎం జగన్ ఐదోరోజు బస్సుయాత్ర ప్రారంభించారు. రాఘవంపల్లి, లింగారెడ్డిపల్లి బస్టాప్‌ల వద్ద వేచి ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బస్సు యాత్ర బత్తలపల్లి కూడలి చేరుకోగానే జై జగన్ నినాదాలు హోరెత్తాయి. అప్పటికే అక్కడికి వేలాదిగా చేరుకున్న అభిమానులు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పూలవర్షంతో అభిమాన నేతకు ఘన స్వాగతం పలికారు. బస్సు టాప్‌పైకి చేరుకున్న జగన్ అన్ని వైపులా కలియతిరుగుతూ దాదాపు 20 నిమిషాల పాటు ప్రజలందరినీ పలకరిస్తున్నట్లుగా చిరునవ్వుతో అభివాదం చేశారు. రోడ్ షో ఆద్యంతం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

కదం తొక్కిన అభిమానం

బత్తలపల్లి మండలం గుమ్మళ్లకుంట, తంబాపురం, జ్వాలాపురం, కోడేకండ్ల, రామాపురం, ఉప్పర్లపల్లి, దంపెట్ల, కట్టకిందపల్లి, డి.చెర్లోపల్లి, సూర్యచంద్రాపురం, నల్లబోయినపల్లి గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపై జననేత రాక కోసం మండుటెండను సైతం లెక్కచేయకుండా వేచి ఉన్నారు. ఊరూరా మహిళలు మంగళహారతులు పట్టారు. పూలతో స్వాగతం పలికారు. తమ అభిమాన నేతకు సంఘీభావంగా నృత్యాలు చేస్తూ, కేరింతలు కొట్టారు. సీఎం జగన్ ప్రతి గ్రామంలోనూ బస్సు ఆపి డోర్ వద్దకు వచ్చి మరీ వారందరికీ అభివాదం చేసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు సెల్ఫీలు తీసుకుని సంబరపడ్డారు. వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, యువకులు, వృద్ధులు, మహిళలు ప్రచార రథాలు ఎక్కి నృత్యాలు చేశారు. వైఎస్సార్ సీపీ జెండాలతో భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలెక్కి నినాదాలు చేశారు.

పోటెత్తిన ముదిగుబ్బ

బస్సుయాత్ర జొన్నలకొత్తపల్లి, కృష్ణాపురం క్రాస్, సంకేపల్లి మీదుగా ముదిగుబ్బ చేరే సరికి మధ్యాహ్నమైంది. అప్పటికే భారీగా చేరుకున్న జనం అభిమాన నేతకు అపూర్వ స్వాగతం పలికారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినాదాలు హోరెత్తించారు. వారందరికీ అభివాదం చేసిన జగన్ ముందుకు సాగగా.. జనం కూడా బస్సు వెంట పరుగులు తీశారు. మండల కేంద్రం నుంచి రైల్వే గేట్, బైపాస్ రోడ్డు, నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు అభిమానులు దారి పొడవునా వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బస్సుయాత్ర ఎన్ఎస్‌పీ కొట్టాల, మల్లమ్మకొట్టాల మీదుగా మలకవేమల క్రాస్‌కు చేరుకుంది. ముదిగుబ్బలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు, నాగారెడ్డిపల్లి బ్రిడ్జి వద్ద గ్రామస్తులు గజమాలతో జగన్‌కు స్వాగతం పలికారు.

మలకవేములలో అపూర్వ ఆదరణ

ధర్మవరం నియోజకవర్గం శివారున మలకవేముల క్రాస్ వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ ఆదరణ లభించింది. పరిసర ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చి.. గజమాలతో తమ నాయకుడిని సత్కరించారు. వృద్ధులు బస్సెక్కి చిందులు వేశారు. అభిమానులు వెంట రాగా అక్కడి నుంచి కదిలిన బస్సుయాత్ర కుటాగుళ్ల మీదుగా కదిరిలోకి ప్రవేశించింది.

కదిరిలోకి గ్రాండ్ ఎంట్రీ

బస్సుయాత్ర కదిరికి చేరుకోగానే జగన్నినాదం హోరెత్తింది. పట్టణమంతా జనంతో నిండిపోయింది. చీమలపుట్ట పగిలినట్లు కదిరి జన కడలిని తలపించింది. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ గజమాలతో సీఎం జగన్‌ను సత్కరించారు. కదిరి పట్టణంలో దారి పొడవునా అభిమానులు పోటెత్తారు. కదిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థి బీఎస్ మక్బూల్, మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డి, సీనియర్లు పూల శ్రీనివాసరెడ్డి, బత్తల హరి, మాలే శ్రీకాంత్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం నల్లచెరువు, తనకల్లు మండలాల మీదుగా జిల్లా సరిహద్దు ప్రాంతమైన చీకటిమానిపల్లి వరకు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కొనసాగింది.

దారి పొడవునా ఆదరణ

బత్తలపల్లి నుంచి కదిరి వరకు దారి పొడవునా అభిమానులు పోటెత్తారు. తన కోసం వేచి ఉన్న అభిమానులను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్ మధ్యాహ్న భోజన విరామం కూడా తీసుకోకుండా బస్సు యాత్ర కొనసాగించారు. కదిరికి చేరుకున్న తర్వాత ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా వైఎస్సార్ సీపీలో చేరగా, పార్టీ కండువా వేసి వైఎస్ జగన్ ఆహ్వానించారు.

భారీగా చేరికలు

సంజీవపురం విడిది కేంద్రం వద్ద పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్, అమడగూరు మాజీ జెడ్పీటీసీ పుట్టా పురుషోత్తంరెడ్డి, నాయకులు పుట్టా మల్లికార్జున రెడ్డి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే లేపాక్షి మాజీ ఎంపీపీ హనోక్, చంద్రదండు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ అన్సర్ అహ్మద్ తదితరులకు వైఎస్సార్ సీపీ కండువా వేసి జగన్ ఆహ్వానించారు.

నేతలతో సమావేశం

ఉదయం సంజీవపురం వద్ద విడిది కేంద్రానికి నాయకులు భారీ సంఖ్యలో తరలిరావడంతో.. ప్రతి ఒక్కరినీ వైఎస్ జగన్ పేరుపేరునా పలకరించారు. ఫలితంగా ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన బస్సు యాత్ర 10.30 గంటలకు మొదలైంది. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మతోపాటు పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల కన్వీనర్లు, మున్సిపల్ చైర్మన్లు సంజీవపురం వద్ద వైఎస్ జగన్‌ను కలిశారు. అలాగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ముఖ్యనేతలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమయ్యారు.

ఐదో రోజు 105 కి.మీ

ఐదోరోజు బస్సు యాత్ర 105 కిలోమీటర్లు సాగింది. ఉదయం 10.30 గంటలకు సంజీవపురం వద్ద ప్రారంభమైన బస్సుయాత్ర సుమారు 12 గంటల పాటు కొనసాగింది. రాత్రి 10.08 గంటలకు సీఎం వైఎస్ జగన్ తనకల్లు మండలం చీకటిమానిపల్లి వద్ద ఏర్పాటు చేసిన విడిది కేంద్రానికి చేరుకున్నారు.


చీమలదండు: బత్తలపల్లి కూడలిలో కిక్కిరిసిన అభిమానులు


జనతరంగం: ముదిగుబ్బలో భారీగా హాజరైన జనం


నమస్తే అన్నా : ముదిగుబ్బలో అభిమానులకు అభివాదం చేస్తున్న సీఎం జగన్, చిత్రంలో ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ


అదిగదిగో జగనన్న: కదిరి బస్టాండు వద్ద మిద్దెలెక్కి మరీ సీఎం వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న అభిమానులు



అభిమానం

- బత్తలపల్లి సమీపంలో వేరుశనగ పొలంలో పనులు చేసుకుంటున్న మహిళా కూలీలు జగన్ బస్సు యాత్ర చూసి పరుగు పరుగున రోడ్డు పైకి చేరుకున్నారు. వారిని చూసిన సీఎం బస్సు ఆపి వారితో మాట్లాడారు. పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజినమ్మ అనే కూలి వేరుశనగ తొలిపంటను సీఎం జగన్‌కు అందించి అభిమానం చాటారు.
- బత్తలపల్లి కూడలిలో వైఎస్సార్ సీపీ అభిమాని గంటాపురం గ్రామానికి చెందిన పాల్యం అప్పస్వామి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గొర్రెపిల్లను, కంబళిని అందజేశారు.
- ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురానికి చెందిన యోగానందరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ జగన్‌ను చూడాలన్న ఆశతో రోడ్డు వద్దకు చేరుకోగా, ఎమ్మెల్యే కేతిరెడ్డి గుర్తించి సీఎంకు పరిచయం చేశారు. దీంతో వైఎస్ జగన్ ఆయన ఆరోగ్య పరిస్థితి ఆరా తీసి భరోసా ఇచ్చారు.


దివ్యమైన అభిమానం : మలకవేముల క్రాస్‌లో జగన్ రాకకోసం మండుటెండలోనే వేచి చూస్తున్న వృద్ధుడు

తరలివచ్చిన పల్లెలు

జగన్‌ను చూసేందుకు బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం, ముదిగుబ్బ, కదిరి, నల్లచెరువు, తనకల్లు, పుట్టపర్తి, నల్లమాడ, ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, తలుపుల మండలాల పరిధిలోని పల్లెల నుంచి అభిమానులు భారీగా తరలివచ్చారు. మండుటెండను లెక్క చేయకుండా అభిమాన నాయకుడి కోసం గంటల తరబడి వేచి చూశారు.


పుష్పాభిషేకం: పట్నంలో సీఎం జగన్ బస్సుపై పూలు చల్లుతున్న అభిమానులు


సీఎం వైఎస్ జగన్‌కు ఖర్జూరం తినిపిస్తున్న కదిరి అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

మైనార్టీలతో మమేకం

సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాకతో కదిరి పులకించింది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులతో రోడ్లన్నీ నిండిపోయాయి. అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగిన జగన్ పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అందరితోనూ ఆత్మీయంగా మాట్లాడారు. ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మతపెద్దల ఆశీర్వాదం అందుకుని బస్సుయాత్ర కొనసాగించారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

అందరివాడిపై ఆత్మీయ జల్లు


'దండా'లయ్యా: గజమాలతో సీఎం జగన్‌కు స్వాగతం


విజయోస్తు: సీఎం జగన్‌కు బొట్టు పెడుతున్న మహిళ


గుర్తుండిపోయేలా: సోదరుడితో అక్కచెల్లెమ్మల సెల్ఫీ


మళ్లీ సీఎం నువ్వే: జగన్ చిత్రపటంతో ఓ అభిమాని


ఆత్మీయ అభివాదం: ముదిగుబ్బ సమీపంలో జాతీయ రహదారి పొడవునా వేచి వున్న ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్


మామయ్యను చూపించాలని..


ఉత్సాహం.. ఉరకలు..


గుండె నిండా జెండా..

అవ్వాతాతలు కదిలొచ్చారు... మనవడిని చూసి మురిసిపోయారు. అక్కచెల్లెమ్మలు తరలివచ్చారు... సోదరుడిని చూసిన సంతోషంలో ఉప్పొంగిపోయారు. యువకులు పరుగున వచ్చారు... అన్నను చూసి ఉత్సాహంతో ఉరకలేశారు. ఒకరేమిటి..జననేతను చూసిన ఆనందంలో అందరూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆయనపై ఆత్మీయ జల్లు కురిపించారు. సీఎం వైఎస్ జగన్ సోమవారం శ్రీ సత్యసాయి జిల్లాలో చేపట్టిన బస్సు యాత్రకు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. అడుగడుగునా ఆయనపై అభిమానులు పూలవర్షం కురిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


నీరాజనం: మలకవేముల క్రాస్‌లో బస్సుయాత్రలో పాల్గొన్న జనవాహిని


మామయ్యా మేమూ మీ వెంటే: ప్లకార్డులతో చిన్నారులు


జై జగన్: అభిమాన నేతపై పూలవర్షం


చిరు కానుక: అభిమానులు అందించిన గొర్రెపిల్లతో జగన్


పల్లెకు పండగ: జగన్ రాక సందర్భంగా లంబాడీ మహిళల నృత్యం


చల్లంగుండు సామీ: సీఎం జగన్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధులు


మిద్దెలెక్కిన అభిమానం..


జననేతను చూసేందుకు పరుగున వస్తున్న మహిళలు


సమరానికి సిద్ధం: సిద్ధం ప్లకార్డులతో వైఎస్సార్ సీపీ శ్రేణులు

అభ్యర్థుల ఖాతాలపై నిఘా పెట్టండి

- లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- బ్యాంకర్లకు జిల్లా ఎన్నికల అధికారి గౌతమి ఆదేశం


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి గౌతమి

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఖాతాల లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని బ్యాంకర్లను జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలపై తక్షణమే వివరాలు అందించాలన్నారు. ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజ్‌తో కలసి నోడల్ అధికారులు, బ్యాంకర్లతో ఆమె సమావేశమై మాట్లాడారు. అభ్యర్థులు నామినేషన్ వేసే ముందు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను ప్రారంభించేలా చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాల బ్యాంక్ ఖాతాలతో పాటు పెట్రోల్ బంక్ ఖాతాలపై కూడా నిఘా ఉంచాలన్నారు. నగదు మార్పిడిలకు అవకాశం ఇవ్వబోరాదన్నారు.

నిఘా పటిష్టం చేయండి

చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేయాలని సంబంధిత అధికారులు జిల్లా ఎన్నికల అధికారి గౌతమి ఆదేశించారు. ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేస్మెంట్ సిస్టం) అమలుపై కలెక్టర్ సోమవారం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు ఎస్పీ విజయ భాస్కర్‌రెడ్డి కలసి సమీక్షించారు. సీజర్స్ (సీజ్ చేసిన నగదు, వస్తువులు) నమోదు ప్రక్రియ పక్కాగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు.

హోమ్ ఓటింగ్ పక్కాగా చేపట్టాలి

జిల్లాలో హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఎన్నికల అధికారి గౌతమి ఆదేశించారు. ఎన్నికల అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి గౌతమితో పాటు జేసీ, జెడ్పీ సీఈఓ , నగర పాలక సంస్థ కమిషనర్, డీఆర్‌ఓ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి సమీక్షించారు. 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారికి హోమ్ ఓటింగ్ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. వీరందరినీ బీఎల్‌ఓలు తప్పక కలసి పూర్తి వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర సేవలు అందించే 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు.

పీఓ, ఏపీఓల శిక్షణ షెడ్యూలు ఖరారు

సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ నిర్వహణకు 5,267 మంది పీఓలు, ఏపీఓలను నియమించినట్లు కలెక్టర్ ఎం.గౌతమి స్పష్టం చేశారు. పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా శిక్షణకు హాజరవ్వాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్)ను సోమవారం ఆమె సందర్శించి, ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీఓ) మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణకు 2,552 మంది పీఓలు, 2,715 మంది ఏపీఓలను నియమించామన్నారు. వీరికి ఈనెల 5వ, 7వ, 14వ తేదీల్లో నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణిసుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, వసంతబాబు, రాంభూపాల్‌రెడ్డి, ఈఆర్‌ఓ శిరీష, ఎన్ఐసీ డీఐఓ రవిశంకర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి అంజన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు లేకపోవడంతోనే నగదు సీజ్


వివరాలు వెల్లడిస్తున్న సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ

తాడిపత్రి అర్బన్: ఆదివారం స్వాధీనం చేసుకున్న రూ.1.31,35,700 నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతోనే సీజ్ చేసి, తరలింపుదారులపై ఐపీసీ 188 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ తెలిపారు. వివరాలను సోమవారం తాడిపత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ గంగయ్యతో కలసి మీడియాకు ఆయన వెల్లడించారు. తాడిపత్రిలోని మెయిన్ బజార్‌లో నివాసముంటున్న ఒకే కుటుంబానికి చెందిన షేక్ ఖాజీ మస్తాన్ వలి, షేక్ ఖాజీ నసీమున్నీసా, చిన్నకోట్ల రషీదా... కేరళ, మహారాష్ట్ర ప్రాంతాల్లో తక్కువ ధరకే బంగారాన్ని కొనుగోలు చేసి తాడిపత్రిలో ఎక్కువ ధరకు విక్రయించేవారన్నారు. బంగారాన్ని విక్రయించగా వచ్చిన నగదును తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడి ఎలాంటి ఆధారాలు చూపలేదన్నారు. దీంతో నగదును ఐటీ అధికారులకు అప్పగించడంతో వారి ఇళ్లలో ఆ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీల్లో అనుమానించదగ్గ అంశాలు ఏవీ బయటపడలేదన్నారు.

వైఎస్సార్ జలకళ బకాయిలు విడుదల

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ జలకళ పథకం కింద 1,765 మంది రైతుల పొలాల్లో ప్రభుత్వం ఉచితంగా బోరుబావులను తవ్వించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రిగ్గు కాంట్రాక్టర్లకు బకాయి పడిన దాదాపు రూ.6.10 కోట్ల మేర బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే కాంట్రాక్టర్ల ఖాతాల్లో నగదు జమ అయినట్లు డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో వైఎస్సార్ జలకళ బిల్లులకు సంబంధించి ఎలాంటి బకాయిలు లేకుండా 100 శాతం చెల్లింపులు జరిగినట్లు వివరించారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

- నేటి ఉదయం లోపు అందరూ విధుల్లో చేరాల్సిందే
- లేదంటే 25 యాక్ట్ మేరకు చర్యలు తప్పవన్న డీఈఓ

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ ప్రక్రియ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా విధులకు నియమించిన వారు రిపోర్ట్ చేసుకునేందుకు సమయం పట్టింది. దీంతో మధ్యాహ్నం ఒంటి గంటకు మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమైంది. ఒక్కో ఏఈకి 20 పేపర్లు చొప్పున ఇచ్చారు. మంగళవారం నుంచి కచ్చితంగా ప్రతి ఏఈ 40 పేపర్లు దిద్దాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ అధికారి, క్యాంపు ఆఫీసర్ బి.వరలక్ష్మి పరిశీలించారు. కాగా, మూల్యాంకనంలో కీలకపాత్ర పోషించే అసిస్టెంట్ ఎగ్జామినర్లను (ఏఈ) సీనియార్టీ ప్రాతిపదికగా నియమించారు. జిల్లా కేంద్రంలో ఉన్న చాలామంది రిపోర్ట్ చేసుకోలేదు. దీనిపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూల్యాంకనం విధులకు నియమించిన ప్రతి ఒక్కరూ మంగళవారం ఉదయానికి విధిగా రిపోర్ట్ చేసుకోవాల్సిందేనని లేకుంటే యాక్ట్ 25 మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సీ విద్యార్థుల ఉజ్వల భవితకు 'శ్రేష్ట'

అనంతపురం సిటీ: మాల, మాదిగ విద్యార్థుల ఉజ్వల భవిత కోసం ప్రవేశపెట్టిన 'నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ఠ- నెట్స్ 2024' పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరణ నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. ఈ మేరకు జెడ్పీ సాంఘిక సంక్షేమ శాఖల స్థాయీ సంఘాల చైర్‌పర్సన్ నాగరత్నమ్మ సోమవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన ఎస్సీ విద్యార్థులు సీబీఎస్ఈ అనుబంధ ప్రైవేటు విద్యాసంస్థల్లో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. మే 12 నుంచి అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంటాయి. వీటిని డౌన్‌లోడ్ చేసుకుని మే 24న జరిగే రాత పరీక్షకు హాజరు కావచ్చు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


దేవశేఖర్ (ఫైల్)

యాడికి: విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కరెంట్ షాక్‌కు గురై ఓ దినసరి కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామానికి చెందిన జగన్నాథ, లక్ష్మీదేవమ్మ దంపతుల ఏకైక కుమారుడు దేవశేఖర్(23)కు ఏడాది క్రితం కర్నూలుకు చెందిన జయంతితో వివాహమైంది. ప్రస్తుతం జయంతి 3 నెలల గర్భిణి. వేములపాడు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న లైన్‌మ్యాన్ అశోక్ వద్ద దేవశేఖర్ దినసరి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఎల్‌సీ తీసుకుని వేములపాడులోని వ్యవసాయ పొలంలో బోరుబావికి విద్యుత్ కనెక్షన్ బాగు చేస్తుండగా కరెంట్ సరఫరా కావడంతో షాక్ కొట్టి తీగలపైనే పడ్డాడు. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపి దేవశేఖర్‌ను కిందకు దించి 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే దేవశేఖర్ ప్రాణాలు కోల్పోయాడంటూ ఏఈ రాజారావుతో వేములపాడు గ్రామస్తులు తీవ్ర వాగ్వాదం చేశారు.

విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన ఉండాలి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థుల స్థాయికి అనుగుణంగా పాఠ్యాంశాల బోధన ఉండాలని అధ్యాపకులకు కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ సూచించారు. నూతన బోధన పద్ధతులపై ఇస్తున్న శిక్షణలో భాగంగా చరిత్ర, రాజనీతి శాస్త్రం అధ్యాపకులకు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలా భాస్కర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ అధ్యాపకుల్లో బోధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులూ మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, ఎన్ఆర్సీ కోఆర్డినేటర్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

నార్పలలో వ్యక్తి హత్య


వీరభద్ర

నార్పల: ఆర్థిక లావాదేవీల కారణంగా ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చిన ఘటన నార్పలలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా పులివెందుల సమీపంలోని సింహాద్రిపురానికి చెందిన వీరభద్ర (40)కు 12 ఏళ్ల క్రితం నార్పల మండలం గడ్డంనాగేపల్లికి చెందిన రేణుకతో వివాహమైంది. పెళ్లి తర్వాత నార్పలలో స్థిరపడిన ఆయన గడ్డంనాగేపల్లికి చెందిన సమీప బంధువుతో కలసి ఎరువుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థిక లావాదేవీల్లో మనస్పర్థలు తలెత్తడంతో ఇద్దరూ విడిపోయారు. అప్పటి నుంచి డబ్బు విషయంగా తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన దుకాణంలో ఉన్న వీరభద్రపై ఇద్దరు వ్యక్తులు వేట కొడవళ్లతో దాడి చేసి, ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. హతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై ఎస్ఐ రాజశేఖరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ వెంకటశివారెడ్డి పరిశీలించారు.

3న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ బీఈడీ కళాశాలలో మిగిలిపోయిన సీట్లను ఈ నెల 3న స్పాట్ అడ్మిషన్ల కింద భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఆర్.సదాశివారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీఎడ్‌సెట్- 2023లో అర్హత సాధించి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చు. మేథమేటిక్స్‌లో 11, బయాలజికల్ సైన్సెస్‌లో 5, సోషల్ స్టడీస్‌లో 14, ఫిజికల్ సైన్సెస్‌లో 7, ఇంగ్లిష్‌లో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అడ్మిషన్ పొందిన విద్యార్థులు కోర్సు ఫీజును అదే రోజు చెల్లించాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

నేడు 34వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 34వ డివిజన్‌లో మంగళవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మారుతీనగర్ మొదటి క్రాస్ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, హాజరుకావాలని పిలుపునిచ్చారు.

అగ్నికి చీనీ చెట్ల ఆహుతి



కాలిపోయిన చీనీ చెట్లను చూపుతున్న రైతు సుధాకర్ రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు సమీపంలోని వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే రైతుకు చెందిన 320 చీనీ చెట్లు, డ్రిప్ వైరు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఉదయం 11 గంటల సమయంలో పొలంలో మంటలు చెలరేగాయి. గమనించిన పొలం పక్కన ఉన్న రైతులు 11:30 సమయంలో రైతు సుధాకర్ రెడ్డికి ఫోన్‌లో సమాచారం అందించారు. సుధాకర్‌రెడ్డి హుటాహుటిన పొలం వద్దకు చేరుకున్నాడు. ట్రాక్టర్‌లో నీటిని తీసుకువచ్చి మంటలను అదుపు చేశాడు. అప్పటికే 320 చీనీ చెట్లు, డ్రిప్ వైరు కాలిపోయాయి. చీనీ చెట్లలో అంతర పంటగా అనప సాగు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు.

నేడు ఎన్నికల ప్రచారం

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బుక్కచెర్ల, 4 గంటలకు జి.కొత్తపల్లి, 5 గంటలకు గాండ్లపర్తి, 6 గంటలకు వరిమడుగు, 7 గంటలకు ఎం.బండమీదపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఉంటుందన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

యువ ఇంజినీర్ల పాత్ర కీలకం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

రాప్తాడు: సమాజ శ్రేయస్సులో ఇంజినీర్ల పాత్ర కీలకం. యువ ఇంజినీర్లు సానుకూల ఆలోచనలతో ముందుకెళ్లాలని ఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ అన్నారు. మండలంలోని హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 50 మంది ఫైనల్ ఇయర్ సీఎస్‌ఈ విద్యార్థులు శ్రీసత్యసాయి జిల్లాలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న జాతీయ సాంకేతిక సదస్సులో పాల్గొన్నారు. జయశ్రీ, గౌతమి, ఉమా మహేశ్వరి డ్రగ్ రికమెండేషన్ సిస్టం మీద ప్రజెంటేషన్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ క్రిష్టా రెడ్డి, వైస్ చైర్మన్ క్రిష్టా రెడ్డి, ఎండీ రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఏఓ శివా రెడ్డి, సీఎస్‌ఈ విభాగపతి షరీఫ్, సీఎస్ఎం విభాగపతి బాలాజి తదితరులు పాల్గొన్నారు.

అనంత క్రీడాకారుల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అనంత క్రీడాకారులు సత్తా చాటారు. మధ్యప్రదేశ్‌పై ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ జట్టులో సింహభాగం అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉన్నారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, ఏపీ సెక్రెటరీ నాగేంద్ర క్రీడాకారులను అభినందించారు.

జాతీయ సదస్సులో ప్రతిభ

అనంతపురం: జేఎన్‌టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ సదస్సులో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. లైవ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో ఈసీఈ బ్రాంచ్ విద్యార్థులు మహబూబ్ జాన్, లక్ష్మీ ప్రసన్న, హాఫీన, టెక్నికల్ క్విజ్‌లో మౌనిక, అషియ, స్పాట్ ఈవెంట్‌లో జయవర్ధన్ ప్రతిభ కనబరిచి, బహుమతులు గెలుపొందారు. సోమవారం కళాశాల చైర్మన్ అనంత రాముడు, ప్రిన్సిపాల్ రామ్మూర్తి తదితరులు విద్యార్థులను అభినందించారు.

బాబును చిత్తుగా ఓడిద్దాం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: పేదలపై చంద్రబాబు నాయుడు కుటిల రాజకీయం చేస్తున్నారు. వలంటీర్లపై కక్ష కట్టిన బాబును వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడిద్దామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రాప్తాడు పంచాయతీలోని ముస్లిం మూనార్టీ కాలనీలో ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకుంటున్న చంద్రబాబును ఓడిస్తామని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ముక్త కంఠంతో చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవ్వాతాతలు, దివ్యాంగుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ ఇవ్వకూడదంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకోవడం దారుణమన్నారు. ఇంత దుర్మార్గమైన బుద్ధి ఉన్న చంద్రబాబు అవ్వాతాతలకు రూ.4 వేల పింఛన్లు ఇస్తానంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. ఇలాంటి రాబంధులను ఓటుతో తరిమికొడదామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్‌దారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ప్రతి నెలా వారు గ్రామాల్లోని అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు పింఛన్ అందజేసేవారని తెలిపారు ఎన్నికల నియమావళి పేరుతో వలంటీర్లు పింఛన్లు, ఇతర నగదు ఇవ్వకూడదని చంద్రబాబు ఈసీకి తన అనుచరులతో ఫిర్యాదు చేయించారన్నారు. దీంతో ఈసీ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించకూడదని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇదంతా చంద్రబాబు నిర్వాహకంతోనే జరిగిందని గుర్తు చేశారు. చంద్రబాబు కుట్ర మరోసారి బయట పడిందన్నారు. కరోనా మహమ్మారి ప్రభావంతో ఒకరిని ఒకరు మాట్లాడుకోలేని, చూసుకోలేని సమయంలో వలంటీర్లు అన్ని తామై అందరి కోసం పని చేశారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పింఛన్లు

అవ్వాతాతలు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెండు నెలలు మాత్రమే ఇబ్బందులు ఉంటాయని.. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే మీ ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తారని భరోసా ఇచ్చారు. ఎలాంటి అవినీతి, పక్షపాతం లేకుండా పేదలకు అండగా ఉండాలనే ఆలోచనతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మన శ్రేయస్సు కోసం, మనుగడ కోసం కష్టసుఖాల్లో ఆదుకున్న వ్యక్తులను ఆదరించి ఓటు వేసి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఒకసారి ఆలోచన చేసి ఓటు వేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయ శాంతమ్మకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలోవైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న, గంజి అభి, ఎల్ఐసీ వెంకటరాముడు, నరసింహారెడ్డి, మాచిరెడ్డి చెన్నా రెడ్డి, వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, సింగారప్ప, రామచంద్రారెడ్డి, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాల రేటు తగ్గించాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు



ఎస్ఎన్‌సీయూ వైద్యులతో సమావేశమైన సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: నవజాత శిశు కేంద్రం (ఎస్ఎన్‌సీయూ)లో శిశు మరణాల రేటు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు వైద్యులకు సూచించారు. సోమవారం ఎస్ఎన్‌సీయూ వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పసికందులకు అందిస్తున్న సేవలు, మరణాలపై ఆరా తీశారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, ఎస్ఎన్‌సీయూ ఇన్‌చార్జ్ డాక్టర్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలతో పసికందులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా స్టాఫ్‌నర్సు, పారామెడికల్ సిబ్బంది పోస్టులకు ఖాళీగా ఉన్నాయని వాటి భర్తీ విషయాన్ని తెలియజేశారు. సూపరింటెండెంట్ స్పందించి డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవికి విషయాన్ని తెలియజేశారు. పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. వైద్యులు షిఫ్టుల వారీగా విధుల్లో లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



పథకాలను వివరిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: మైనార్టీల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. సోమవారం స్థానిక శ్రీనివాస నగర్‌లోని సదురుద్దీన్ మసీదు సమీపంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు మాట్లాడారు. గతంతో పోలిస్తే మైనార్టీలు ఈనాడు రాష్ట్రంలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందారన్నారు. నామినేటెడ్ పోస్టులను ముస్లింలకు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని, మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేగా అనంత వెంకటరామిరెడ్డి గెలిపించాలని కోరారు.

ఐదుగురు వలంటీర్ల సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఐదుగురు వలంటీర్లను కలెక్టర్ ఎం.గౌతమి సోమవారం సస్పెండ్ చేశారు. తాడిపత్రి నియోజవర్గం పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి గ్రామ వాలంటీర్లు బి.రమేష్, ఎస్.ప్రసాద్‌రెడ్డి, తాడిపత్రి మండలం సజ్జలదిన్నె వలంటీర్లు ఎం.చిన్న ఓబుళేసు, పసులూరు ఆంజనేయులు, ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం హవళిగి గ్రామ వలంటీర్ దేవరింటి రంగప్ప సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇప్పటి వరకూ రూ.1.60 కోట్ల నగదు సీజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

చీనీ అమ్మకాల్లో 4 శాతం కమీషన్

అనంతపురం అగ్రికల్చర్: చీనీ అమ్మకాల సీజన్ ప్రారంభమైనందున రైతులు నష్టపోకుండా సహకరించాలని వ్యాపారులకు మార్కెట్ యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి సూచించారు. సోమవారం తన ఛాంబర్‌లో వ్యాపారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. ఈ-నామ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తామన్నారు. క్రయవిక్రయాలకు సంబంధించి 4 శాతం కమీషన్ తీసుకోవాలన్నారు. సూట్లు, కమీషన్లపై రైతుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రేడ్-2 సెక్రటరీ రూప్‌కుమార్, సూపర్‌వైజర్లు కేశవకుమార్, కృపావతి, నాగేంద్ర, మార్కెట్ ఇన్‌చార్జి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఇంధన వినియోగంతో అనర్థాలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ జీవీఆర్ శ్రీనివాస రావు

అనంతపురం: అధిక ఇంధన వినియోగంతో కర్బన ఉద్గారాలు అధికంగా విడుదలై పర్యావరణానికి విఘాతం కలుగుతుందని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 'టువర్డ్స్ నెట జీరో ఎమ్మిసన్స్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్లోబల్ వార్మింగ్ వల్ల వాతావరణానికి పెనుముప్పు కలుగుతోందన్నారు. ప్రొఫెసర్ ఏ. వీరేష్ బాబు (నిట్, వరంగల్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం) వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే అంశాల గురించి వివరించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణ కాంతి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర కళ్యాణి రాధ, డాక్టర్ బి. ఓం ప్రకాష్, డాక్టర్ డీఆర్ శ్రీనివాసన్, డాక్టర్ కేఎఫ్ భారతి పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



ప్రతిభ చాటిన క్రీడాకారులతో కోచ్‌లు

అనంతపురం: ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ స్కే మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. విజయవాడలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా బాలికల లీగ్ స్కే మార్షల్ ఆర్ట్స్ పోటీలు జరిగాయి. అండర్-4, 17 సీనియర్ బాలికల మధ్య జరిగిన పోటీల్లో సత్తా చాటారు. అండర్-14 విభాగంలో 45 కేజీల విభాగంలో రోషిని, ఖవానకీలో హారిక మూడో స్థానం, అండర్-17 ఖవానకీ కే2 విభాగంలో హాసిని రెడ్డి మొదటి స్థానం దక్కించుకుంది. సీనియర్-58 కేజీల విభాగంలో చాందిని మొదటి స్థానం సాధించింది. వీరందరూ సౌత్ జోన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. మాస్టర్ షాకీర్, మాస్టర్ మురళీ కృష్ణా రెడ్డి వద్ద శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



రాప్తాడులో ఎంపీడీఓ గీతావాణికి రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు



రాజీనామా పత్రాలు అందజేస్తున్న పాపంపేట 4వ సచివాలయ వలంటీర్లు

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి-2 సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న 20 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల గడప వద్దకు సంక్షేమ పథకాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లను తీవ్రవాదులతో పోల్చుతూ మాట్లాడుతున్న టీడీపీకి ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవడానికి జగనన్న సైనికులుగా మారుతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రసన్నాయపల్లి గ్రామ సచివాలయం-2 పరిధిలో 20 వలంటీర్లు రాజీనామా చేయగా.. గత నాలుగు రోజుల క్రితం నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఇప్పటి వరకు మండలా వ్యాప్తంగా 24 మంది రాజీనామా చేశారు.

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట 4వ సచివాలయ పరిధిలో 51 మంది వలంటీర్లు ఉండగా.. 35 మంది సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి మహేంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు లావణ్య, నాగవేణి, ఎరిలక్ష్మి, గోవిర్ధిణి, ఉమామహేశ్వరి, రమ్య, రమణి, ఉస్మాన్, మహేంద్ర తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ బాధ్యతగా అందేలా చూస్తున్నామన్నారు. సేవా భావంతో ఉద్యోగంలో చేరామన్నారు. టీడీపీ ప్రోద్బలంతో నిమ్మగడ్డ రమేష్ తన సిటిజన్ ఫోరం ఫర్ డెమోక్రసీ సంస్థ పేరుతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ కారణంగా తమను పింఛన్ల పంపిణీ విధుల నుంచి పక్కన పెట్టారని పేర్కొన్నారు.

ఎస్టీయూ 'సమాచార స్రవంతి' విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఆర్ బాలికల పాఠశాలలోని పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో సోమవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సమాచార స్రవంతి ప్రతిని విడుదల చేశారు. అనంతరం మూల్యాంకనంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ప్రతులను పంపిణీ చేశారు. మూల్యాంకన సమాచారంతో పాటు విద్యారంగానికి సంబంధించి ముఖ్యమైన జీఓల వివరాలు ఇందులో పొందుపరిచారని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్లు కృష్ణమోహన్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, మహమ్మద్ రఫీ. నాయకులు డేనియల్, సురేష్, మల్లికార్జున, ఇమామ్ సాహెబ్, మహేష్, నాగేంద్ర ప్రశాంతి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని ఆరో రోడ్డు శ్మశానవాటికలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ ధరణి కిశోర్ తెలిపారు. వారి నుంచి రూ.3,850 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి



ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: గ్రామాల్లో అభివృద్ధి జరగాలన్నా.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి. ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గొరిదిండ్ల తండా, గొరిదిండ్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో కేవలం జన్మభూమి కమిటీల సభ్యులు సిఫార్సు చేసిన వారికే పథకాలు అందాయని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆపేస్తాం.. తక్కువ ధరలకు మద్యం ఇస్తామని చంద్రబాబు చెప్పడం దుర్మార్గమన్నారు. అయితే అభివృద్ధి చేస్తామని చెప్పలేకపోతున్నారన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఉచితంగా బోర్లు వేయించారని పేర్కొన్నారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చారన్నారు. డెయిరీ ద్వారా చాలా మందికి ఉపాధి కల్పించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, వైస్ ఎంపీపీ విజయ్ సర్పంచులు నాగరత్నమ్మ, ఓబులేష్, ఎర్రిస్వామి, తిరుపాలమ్మ, ఎంపీటీసీలు చిటెక్క, ఓబులేష్, మాజీ సర్పంచ్ సుశీల, మాజీ ఎంపీపీ హనుమంతు నాయక్, నాయకులు వాసుదేవరెడ్డి, వెంకట్రాముడు, తైదుల శివారెడ్డి, రాము నాయక్, మహేష్ నాయక్, గోవింద్, రమేష్, పోతన్న, అతిక్‌రెడ్డి, భానుకోట బాలపోతన్న, కేశవ రెడ్డి, నరసింహులు, మాధన్న, లక్ష్మీరెడ్డి, ముత్యాల రెడ్డి, వెంకటేష్, దామోదర్, ఓబయ్య, రజాశేఖర్, గడార వెంకటేష్, శ్రీరామ్, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఏహెచ్‌ఏలకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ పరిధిలో విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్‌ఏ)గా ఇటీవల నియమితులైన వారికి సోమవారం శిక్షణ కార్యక్రమం మొదలైంది. ఉమ్మడి జిల్లా పరిధిలో 457 మంది నియమితులయ్యారు. అందులో అనంతపురం జిల్లాలో 285 మంది విధుల్లో చేరారు. వీరందరికీ మే 15వ తేదీ వరకూ అంటే 45 రోజుల పాటు వారి విధులు, బాధ్యతల గురించి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. అనంతపురం జేడీ కార్యాలయ ప్రాంగణంలో రెండుబ్యాచ్‌లు, సాయినగర్ పశువుల ఆస్పత్రిలో ఒక బ్యాచ్, రెడ్డిపల్లి ప్రాంతీయ పశు శిక్షణ కార్యాలయంలో రెండు బ్యాచ్‌లు, సిద్ధరాంపురం పశుగ్రాస క్షేత్రంలో ఒక బ్యాచ్.. ఇలా ఆరు బ్యాచ్‌లకు శిక్షణ మొదలైనట్లు ఆ శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణా కార్యక్రమం పద్ధతి ప్రకారం నిర్వహించడానికి 28 మంది అధికారులకు బాధ్యతలు అప్పజెప్పామన్నారు. శిక్షణా కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించామన్నారు. పూర్తిస్థాయి పర్యవేక్షకులుగా అనంతపురం, ఉరవకొండ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ జి.వెంకటేష్ వ్యవహరిస్తారని తెలిపారు. కోర్సు కో-ఆర్డినేటర్ కమ్ రిసోర్సు పర్సన్లుగా ఏడీలు ఎస్.శ్రీనివాస గుప్తా, కేఎల్ శ్రీలక్ష్మి, డి.శ్రీనివాసరావు, వి.రామచంద్రారెడ్డి, ఏవీ రత్నకుమార్, ఎం.రాధిక, అలాగే రిసోర్సుపర్సన్లుగా సి.సుబ్రహ్మణ్యం, టీవీ సుధాకర్, బి.నాగార్జున రెడ్డి, జే.సురేష్, జి.పద్మనాభం, ఎం.కాంతమ్మ, టి.కిరణ్‌కుమార్ రెడ్డి, ఏ.గోల్డ్‌స్మన్, కే.గోవిందరాజులు, పి.మహేష్, వి.క్రిష్ణమూర్తి నాయక్, ఏ.రమేష్, పి.మంజునాథ్, బి.సూర్యనారాయణరెడ్డి, పి.నవీన్‌కుమార్, సి.చేతన్‌కుమార్, కె.వినోద్‌కుమార్, జె.శ్రీకాంత్, వి.స్రవంతి, పశు శాస్త్రవేత్త డాక్టర్ కె.మాధవి తదితరులు హాజరై అవగాహన కల్పించారని తెలిపారు. రోజూ ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: పేదవర్గాల ఆశాజ్యోతి, సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిని బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. టీడీపీ గెలిస్తే ప్రజాధనమంతా పెద్దలకు దోచిపెడతారని, వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే పేదలకు పంచి పెడతారన్నారు. పేదల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచులు గాండ్ల కృష్ణయ్య, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సనీల్‌దత్త రెడ్డి, నాయకులు ఉప్పరపల్లి శ్రీనివాసులు డాక్టర్ శీనా, ఆలమూరు ఓబులేసు, పూలకుంట భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కల్లమడి శ్రీనివాసులు, బయప్ప, ఉప సర్పంచ్ బండి రమేష్, నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గాండ్ల ఆదినారాయణ, సాకలి వెంకటరాముడు, బండి లక్ష్మీనారాయణ, వార్డు మెంబర్లు నాగరాజు, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, బాలప్ప పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా వీఏహెచ్‌ఏలకు శిక్షణ



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేడీ సుబ్రహ్మణ్యం, డీడీలు రమేష్ రెడ్డి, వెంకటేష్ తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్‌ఏ)కు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్, అడిషనల్ డైరెక్టర్ ఆదేశించారు. 45 రోజుల పాటు నిర్వహించే శిక్షణ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన నేపథ్యంలో జూమ్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. పశుశాఖ కార్యాలయంలో జరిగిన కాన్ఫరెన్స్‌లో జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ జి.వెంకటేష్, ఏడీ డాక్టర్ ఏవీ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. వీఏహెచ్‌ఏలు పూర్తిస్థాయిలో పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. షెడ్యూల్ ప్రకారం రీసోర్సుపర్సన్లు హాజరయ్యేలా చూడాలన్నారు. అలాగే వీఏహెచ్‌ఏలు వంద శాతం శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజూ ఉదయం 10 గంటలకు హాజరుశాతానికి సంబంధించిన నివేదిక ఇవ్వాలన్నారు. శిక్షణ ఇచ్చే ప్రాంతాల్లో అన్ని రకాల వసతులు, మధ్యాహ్నం భోజన వసతి ఉండాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా 45 రోజుల శిక్షణను విజయవంతం చేయాలని సూచించారు.

ప్రజా చైతన్యమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం

అనంతపురం కల్చరల్: ప్రజా చైతన్యం ద్వారా మూఢనమ్మకాలను తొలగించవచ్చని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో స్థానిక సంగమేశ్వర నగర్‌లోని పీపుల్స్ లైబ్రరీలో మ్యాజిక్ షో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. కొంత మంది స్వామీజీల, పాస్టర్ల అవతారాలనెత్తి మాయలు, మంత్రాలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నిజం చెప్పాలంటే మాయలనేవి ఎంత మాత్రం లేవని కేవలం సైన్సు మాత్రమే ఉందన్నారు. కళాకారులు ప్రసాద్, తిప్పేస్వామి, ప్రదర్శించిన పలు మ్యాజిక్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ప్రసూన, జిలాన్, గాంగేనాయక్, రామిరెడ్డి, రామకృష్ణ, నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.